# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **అమరావతిలోని ఎపిసిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ప్రారంభిస్తారు.**

3. **రాష్ట్రానికి విశాఖపట్నం ఆర్థిక రాజధాని అని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.**

4. **కార్డియో పల్మనరీ రిససిటేషన్ – సీపీఆర్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రేపటి నుంచి అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోంది.**

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ 25 సంవత్సరాలుగా దేశానికి సేవలందిస్తున్నారని నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి శుభాకాంక్షలు తెలిపారు.

-------------------------

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – ఎపిసిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ప్రారంభిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాజధాని అమరావతి నుంచి కార్యకలాపాలు నిర్వహించేందుకు సిద్ధమైన మొదటి పాలనా భవనం అని పేర్కొన్నాయి. అమరావతికి ప్రతీకగా 'ఎ' అనే అక్షరంతో నిర్మించినట్లు వివరించాయి.

-------------------------

రాష్ట్రానికి విశాఖపట్నం ఆర్థిక రాజధాని అని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడారు. విశాఖపట్నంలో 5 లక్షల ఉద్యోగాల కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్

పేర్కొంటూ..

..వాయిస్ .. 30 సెకన్లు

-----------------------------

సూపర్ జిఎస్టి.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమాల్లో భాగంగా రేపటి నుంచి 19వ తేదీ వరకు ఏలూరు సి.ఆర్. రెడ్డి డిగ్రీ కళాశాల మైదానంలో హేలాపురి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. హేలాపురి ఉత్సవం ఏర్పాట్ల పై అధికారులతో ఆమె నిన్న టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ.. జిఎస్టి ఫలాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు షాపింగ్ ఫెస్టివల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. షాపింగ్ ఉత్సవంలో పెద్ద ఎత్తున స్టాల్స్ ను ఏర్పాటు చేసేలా వర్తకులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

-----------------------------

భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే క్రమంలో ప్రతి ఒక్కరు స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్రా శివన్నారాయణ తెలిపారు. బాపట్ల జిల్లా చీరాలలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్.. 26 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 14వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విజయవాడ జోన్ కామాండెంట్ ముద్దాడ శంకర్రావు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో భాగంగా వాలీబాల్, బ్యాడ్మింటన్, 100, 400 మీటర్లు, 5 కిలో మీటర్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

-----------------------------

సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు ఆధ్వర్యంలో ఒంగోలులో ఈరోజు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు అడిగిన సమాచారాన్ని అధికారులు అందించాలని కోరారు. విజయవాడలోని ప్రధాన సమాచార కార్యాలయంలో దృశ్య మాధ్యమం ద్వారా విచారణ నిర్వహిస్తున్నారని ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందని చిన ఓబులేషు తెలుపుతూ..

..వాయిస్.. 32 సెకన్లు

-----------------------------

గుండెపోటు వచ్చినప్పుడు ప్రాణాలు కాపాడే కార్డియో పల్మనరీ రిససిటేషన్ – సీపీఆర్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రేపటి నుంచి ఈ నెల 17వ తేదీ వరకు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోంది. వర్చువల్‌లో సీపీఆర్ ప్రతిజ్ఞ చేయించాలని, ప్రదర్శనలు.. చర్చా కార్యక్రమాలు, క్విజ్ పోటీలు

చేపట్టాలని సూచించింది. వాటిని #CPR4Life2025 హ్యాష్‌ట్యాగ్‌తో సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలని పేర్కొంది.

-------------------------

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి డివిజన్‌లోని 147 అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ అభయాన్ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శాంతి దుర్గ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సహజంగా మహిళల్లో వచ్చే అనారోగ్య సమస్యల గురించి వారికి అవగాహన కల్పించి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఏ విధంగా ఆరోగ్యవంతలవుతారో ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు తెలియజేస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి శాంతి దుర్గ చెబుతూ..

వాయిస్.. 28 సెకన్లు

-------------------------

ఒడిశాలోని భువనేశ్వర్ వేదికగా జరుగుతున్న 40వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ అథ్లెట్లు పలు పతకాలు సాధించారు. 1500 మీటర్ల పరుగు పోటీలో వెంకటరామిరెడ్డి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోగా, 110 మీటర్ల హెడ్డిల్స్ విభాగంలో షేక్ రోషన్ రజత పతకం సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమినీ రవి నాయుడు వీరికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి దేశానికి పేరు తెచ్చే అథ్లెట్లుగా ఎదగాలనే ఆశాభావం వ్యక్తం చేశారు.

-------------------------

దక్షిణకోస్తా దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి సగటున 3.1 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో.. రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి జి. లక్ష్మీ తెలియజేస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు

-------------------------

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య క్రికెట్ రెండవ టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో భాగంగా భారత్ 518 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ 248 పరుగలకు ఆలౌట్ అయింది. 270 పరుగుల అధిక్యంలో భారత్ ఉంది. మ్యాచ్ ఫలితం తెలియడానికి ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉంది.

====================